పెండ్లికి నిరాకరణ ఆత్మహత్యకు

ప్రేరేపించినట్టు కాదు

బంధాల విచ్ఛిన్నం నేరుగా సూసైడ్‌కు ప్రేరేపించదు

యువతి ఆత్మహత్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: కేవలం పెండ్లికి నిరాకరించడం ఆత్మహత్యకు ప్రేరేపించినట్టు కాదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. బంధాలు విచ్ఛిన్నమవడం మానసిక వేదనకు గురి చేసేదే అయినప్పటికీ, నేరుగా అది ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించదని వ్యాఖ్యానించింది. 2007లో ఓ యువతి(21) ఆత్మహత్య కేసులో పెండ్లి పేరుతో మోసం చేసి, ఆత్మహత్యకు ప్రేరేపించాడనే కారణంతో కమరుద్దీన్ దస్తగిర్ సనాది అనే వ్యక్తికి కర్ణాటక హైకోర్టు ఐదేండ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించింది. ఈ తీర్పును అతడు సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, శుక్రవారం జస్టిస్ పంకజ్ మితల్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారించింది. 'నిందితుడు కేవలం పెండ్లికి నిరాకరించాడు. ఇది బంధం విచ్ఛిన్నం కావడం మాత్రమే. మృతురాలిని అతడు ఆత్మహత్యకు ప్రేరేపించలేదు. నిందితుడిని పెండ్లికి ఒప్పించాలని, ఒప్పుకోకపోతే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనతో మృతురాలు ముందుగానే విషం తీసుకెళ్లింది. కాబట్టి, కేవలం పెండ్లికి నిరాకరించాడనే కారణంతో ఆత్మహత్యకు ప్రేరేపించాడని దోషిగా తేల్చలేం.' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అతడు పెండ్లి చేసుకుంటానని వాగ్దానం చేసినట్టు ఆధారాలు లేవని, ఒకవేళ ఆ వాగ్దానం చేసినా దానికి సెక్షన్ 306(ఆత్మహత్యకు ప్రేరేపించడం) వర్తించదని, ఇతర చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. కర్ణాటక హైకోర్టు తీర్పును కొట్టేసింది.

శ్రీలంక, భారత్ సంయుక్త ఆపరేషన్‌లో పట్టుబడ్డ డ్రగ్స్, పడవల సిబ్బంది

500 కిలోల డ్రగ్స్ సీజ్

అరేబియా సముద్రంలో భారత్ శ్రీలంక సంయుక్త ఆపరేషన్

న్యూఢిల్లీ, నవంబర్ 29: అరేబియా సముద్రంలో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. భారత్, శ్రీలంక నేవీలు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో రెండు చేపల వేట పడవల నుంచి 500 కిలోల క్రిస్టల్ మెథాంఫెటమిన్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. శ్రీలంక జెండాలతో ప్రయాణిస్తున్న రెండు పడవలపై శ్రీలంక నేవీ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఇరు దేశాల నేవీలు జాయింట్ ఆపరేషన్ చేపట్టినట్టు భారత నేవీ ప్రకటించింది. న్యాయపరమైన చర్యల కోసం పట్టుబడిన డ్రగ్స్, పడవలు, వాటిలోని సిబ్బందిని శ్రీలంకకు అప్పగించినట్టు వెల్లడించింది.

62 దేశాల ఆపరేషన్..

1,400 టన్నుల డ్రగ్స్ పట్టివేత

62 దేశాలు కలిసి చేపట్టిన 'ఆపరేషన్ ఓరియన్'లో భారీగా మత్తు పదార్థాలు దొరికాయి. ఆరు వారాల పాటు చేపట్టిన ఈ భారీ ఆపరేషన్‌లో 225 టన్నుల కొకైన్, 1000 టన్నుల మరిజువానాను కొలంబియా సహా వివిధ దేశాల నౌకా దళాలు సీజ్ చేశాయి. ఇంత భారీ ఎత్తున కొకైన్ పట్టుబడటం ఇదే మొదటిసారి. డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేస్తున్న ఆరు జలాంతర్గాములను సీజ్ చేశారు. డ్రగ్స్ రవాణాతో సంబంధమున్న 400 మందిని అరెస్టు చేశారు. దక్షిణ అమెరికా నుంచి ఆస్ట్రేలియాకు డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేస్తున్న కొత్త పసిఫిక్ సముద్ర దారిని ఈ ఆపరేషన్‌లో గుర్తించినట్టు కొలంబియా నేవీ వెల్లడించింది.

దివ్యాంగులకూ దగా

- 80 శాతం నిధులు తగ్గించిన కర్ణాటక కాంగ్రెస్ సర్కారు
- వినికిడి పరికరాలు, బ్రెయిలీ కిట్లు ఇవ్వలేని దుస్థితి
- రాష్ట్రవ్యాప్తంగా మండి పడుతున్న దివ్యాంగులు
- గ్యారెంటీలకే మళ్లుతున్న అన్ని ప్రభుత్వ నిధులు!

బెంగళూరు, నవంబర్ 29: గ్యారెంటీల పేరుతో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పాత పథకాలకు కోత పెడుతున్నది. గ్యారెంటీలకు నిధుల సమీకరణ కోసం ఇప్పటికే వివిధ రకాల చార్జీలు పెంచుతూ వస్తున్న సిద్ధరామయ్య సర్కారు.. ఇతర పథకాల నిధులను భారీగా తగ్గిస్తున్నది. ఆఖరికి దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించే నిధులను కూడా భారీగా తగ్గించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే దివ్యాంగుల కోసం కేటాయించాల్సిన నిధులను 80 శాతం మేరకు ప్రభుత్వం తగ్గించింది. వివిధ పథకాల ద్వారా దివ్యాంగులకు అవసరమైన వినికిడి పరికరాలు, బ్రెయిలీ కిట్లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, బ్యాటరీతో నడిచే చక్రాల కుర్చీలు, విద్యార్థులకు టాకింగ్ ల్యాప్‌టాప్‌లు వంటివి ప్రభుత్వం పంపిణీ చేస్తుంది.

గత ఏడాది వీటి కోసం ప్రభుత్వం రూ.53 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది మాత్రం ఈ పథకాలకు కేవలం రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం కర్ణాటకలో 13.24 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారు. దీంతో ప్రభుత్వం అందించే పరికరాల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. కేవలం వినికిడి పరికరాల కోసం 5,173 మంది దరఖాస్తు చేస్తుకున్నారు. అయితే కేటాయించిన నిధులతో వీరిలో పదో వంతు మందికి కూడా పరికరాలు లభించవని దివ్యాంగుల సంఘాలు వాపోతున్నాయి. 553 మంది దివ్యాంగ విద్యార్థులు టాకింగ్ ల్యాప్‌టాప్ కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం 35 మందికి మించి ఇవ్వలేదని చెప్తున్నారు. దివ్యాంగుల నిధులకు కోత పెట్టడం అన్యాయమని, అసాధారణమని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంస్థ ఆరోపించింది.

ఖజానాలోని నిధులన్నీ గ్యారెంటీలకు!

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేస్తున్నాయి. వీటికి నిధులు సరిపోక పెట్రోల్, పాలు, మద్యం, ఇలా అన్నింటి ధరలను ప్రభుత్వం పెంచుతున్నది. దీనికి తోడు గ్యారెంటీలకు నిధులు సమీకరించేందుకు వివిధ వర్గాల సంక్షేమం కోసం వినియోగించాల్సిన ఆయా కార్పొరేషన్ల నిధులను కూడా మళ్లిస్తున్నది. దివ్యాంగుల సంక్షేమానికి సైతం నిధులు తగ్గించడానికి కారణమిదేననే విమర్శలు వస్తున్నాయి. కాగా, రూ.14,730.53 కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను గ్యారెంటీలకు మళ్లించడంపై జాతీయ ఎస్సీ కమిషన్ సైతం ప్రభుత్వానికి ఇటీవల నోటీసులు జారీ చేసింది. మరోవైపు, గ్యారెంటీల వల్ల అభివృద్ధి పనులకు నిధులు ఉండటం లేదని, వాటిని ఆపేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే డిమాండ్ చేస్తున్న పరిస్థితి నెలకొన్నది.

మహారాష్ట్రలో బస్సు బోల్తా

11 మంది మృతి..

ముంబై: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. శుక్రవారం మధ్యాహ్నం భండారా నుంచి గోండియాకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒకటి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డవారిని దవాఖానకు తరలించారు. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సు అదుపు తప్పి బోల్తా కొట్టిందని ప్రత్యక్ష సాక్షులు కొంతమంది చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ, ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ షిండే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రధాని రూ.2 లక్షలు, సీఎం షిండే రూ.10 లక్షలు పరిహారాన్ని ప్రకటించారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సీఎం షిండే జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

కర్ణాటక సీఎం మార్పుపై ఊహాగానాలు

అధిష్ఠానం నిర్ణయిస్తే తప్పదన్న ఎమ్మెల్యే బీఆర్ పాటిల్

బెంగళూరు, నవంబర్ 29: దేశంలో క్షేత్ర స్థాయి నుంచి ఏఐసీసీ స్థాయి వరకు పార్టీలో ప్రక్షాళన జరుగుతుందని కాంగ్రెస్ అధిష్ఠానం చేసిన ప్రకటన కర్ణాటకలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పదవి నుంచి దించే స్తారంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో సీఎం సన్నిహితుడు, ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. సిద్ధరామయ్య మార్పుపై ఎలాంటి చర్చలు జరగడం లేదని పేర్కొన్న ఆయన సీఎం మార్పు అధిష్ఠానం చేతిలో ఉందని అనడం గమనార్హం. ఎమ్మెల్యేలెవరూ సిద్ధరామయ్యను మార్చాలని కోరుకోవడం లేదని, అయితే సిద్ధరామయ్య దిగిపోవాలని అధిష్ఠానం నిర్ణయిస్తే మనమేం చేయగలమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర కూడా సీఎం, కేపీసీసీ అధ్యక్షుని మార్పు ఉండొచ్చని సంకేతాలిచ్చారు.

కేపీసీసీ కార్యదర్శి ఓ కామ పిశాచి!

టీచర్ ఫిర్యాదుతో లైంగిక వేధింపుల కేసు నమోదు

బెంగళూరు: కర్ణాటకలో ఓ ఉపాధ్యాయురాలిపై(38)పై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు కాంగ్రెస్ నేత డాక్టర్ బీ గురప్ప నాయుడిపై కేసు నమోదైంది. బాధితురాలు త్యాగరాజ నగర్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ నెల 26న సీకే అచ్చుకట్టు పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. ప్రస్తుతం కర్ణాటక పీసీసీ జనరల్ సెక్రటరీగా ఉన్న గురప్ప ఓ కామ పిశాచి అని ఆమె ఆరోపించారు. తనను తన చాంబర్లోకి పిలిచి, అసభ్యకరంగా మాట్లాడటంతోపాటు, తన చేతిని పట్టుకుని తనవైపుకు లాగాడని చెప్పారు. తాను అభ్యంతరం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడన్నారు. తర్వాత పోలీసులను ఆశ్రయించానని ఆమె తెలిపారు.

క్రమశిక్షణ లేకే ఎన్నికల్లో ఓడాం

సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే

న్యూఢిల్లీ, నవంబర్ 29: కాంగ్రెస్ పార్టీలో క్రమ శిక్షణ లోపించడం పట్ల ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన క్రమంలో ఢిల్లీలో శుక్రవారం సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఉత్సాహంతో పునరాగమనం చేసిందని, అయితే మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పార్టీని నిరాశ పరిచాయని అన్నారు. పార్టీ ప్రక్షాళన అవసరమని పేర్కొన్నారు. పార్టీలో ఐక్యత లేకపోవడం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వంటి అంశాలు ఎన్నికల్లో బాగా దెబ్బ తీశాయని ఆయన చెప్పారు. ఈవీఎంలు ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చేశాయని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేలా ఈసీ వ్యవహరించాలని ఆయన కోరారు. పార్టీని బలోపేతం చేయడానికి కింది నుంచి ఏఐసీసీ స్థాయి వరకు మార్పులు తీసుకురావాలని అన్నారు.

జన్యు మార్పిడి విత్తనాలపై

నిషేధం విధించండి

ప్రధానికి రైతు నేత టికాయత్ లేఖ

న్యూఢిల్లీ: దేశంలో జన్యుమార్పిడి (జీఎం) విత్తనాలపై పూర్తిగా నిషేధం విధించాలని కోరుతూ ప్రధాని మోదీకి రైతు నేత రాకేశ్ టికాయత్ లేఖ రాశారు. జన్యు పరివర్తన చెందిన పంటలు పర్యావరణంతోపాటు ప్రజారోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీటీ (బాసిల్లియస్ తురింజియెన్సిస్)పత్తిని దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు.జీఎం పంటలపై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ అక్రమంగా అవి దేశంలోకి వచ్చి చేరుతున్నాయని పేర్కొన్నారు. సరైన ప్రమాణాలు పాటించకపోవడం వల్లే అవి దేశంలోకి చొరబడుతున్నాయని విమర్శించారు. వీటి కారణంగా జాతీయ జీవ భద్రతకు పెను ముప్పు వాటిల్లుతుందన్నారు. జన్యు మార్పిడి పంటలు క్యాన్సర్, చర్మ సంబంధ సమస్యలతో పాటు పశువులు, పరపరాగ సంపర్కంపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

సంభల్ మసీదుపై ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు బ్రేక్

న్యూఢిల్లీ: మొఘలుల కాలంనాటి షాహీ జామా మసీదు కేసులో ప్రొసీడింగ్స్‌ను తాత్కాలికంగా నిలిపేయాలని సంభల్ ట్రయల్ కోర్టును సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. హింసాత్మక ఘర్షణలు జరిగిన సంభల్‌లో శాంతి, సామరస్యాలను కాపాడాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు కమిషనర్ నిర్వహించిన సర్వే నివేదికను సీల్ చేసి ఉంచాలని, దానిని తెరవవద్దని చెప్పింది. ట్రయల్ కోర్టు ఆదేశాలపై మసీదు కమిటీ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. సంభల్‌లోని చందౌసీ వద్ద ఉన్న ఈ మసీదును సర్వే చేయడానికి సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) ఈ నెల 19న ఆదేశించింది.

భారీగా యురేనియం శుద్ధికి ఇరాన్ సిద్ధం!

దుబాయ్: ఇరాన్ అత్యంత ఆధునిక యంత్రాలతో యురేనియంను శుద్ధి చేసేందుకు సిద్ధమవుతున్నది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) వెల్లడించిన వివరాల ప్రకారం, ఫోర్డో, నటంజ్‌లలోని అణు కేంద్రాల్లో వేలాది ఆధునిక యంత్రాలు (సెంట్రిఫ్యూజెస్)తో యురేనియంను శుద్ధి చేయడానికి ఇరాన్ ప్రణాళిక రచించింది. ప్రస్తుతం 60 శాతం స్వచ్ఛతతో శుద్ధి చేస్తుండగా, కొత్త సెంట్రిఫ్యూజెస్‌తో కేవలం 5 శాతం శుద్ధ యురేనియం కోసం ప్రయత్నిస్తున్నది. దీనిని బట్టి అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్‌తోనూ చర్చలు జరపాలని ఇరాన్ కోరుకుంటున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఇరాన్ ప్రయత్నాలు ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలను పెంచే అవకాశాలు ఉన్నాయి.

రోజుకు రూ.200కు పాక్ గూఢచారికి సమాచారం అమ్మకం

నిందితుడి అరెస్ట్

ఓఖా (గుజరాత్) : ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) నౌకలు, పడవల కదలికల గురించి పాకిస్థాన్ గూఢచారికి సమాచారం ఇస్తున్న దీపేష్ గోహిల్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్ట్ చేసింది. దీపేష్ ఐసీజీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఐసీజీ పడవలు, నౌకలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఇస్తున్నందుకు అతనికి రోజుకు రూ.200 చొప్పున పాక్ గూఢచారి ఇస్తున్నాడు. మొత్తం మీద అతనికి ఆ పాకిస్థాన్ ఏజెంట్ నుంచి రూ.42 వేలు అందింది. ఫేస్ బుక్ ద్వారా వీరిద్దరికీ పరిచయమైనట్లు వెల్లడైంది.

ట్రంప్‌నకు ముప్పుంది: పుతిన్

మాస్కో: అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ భద్రత గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కజకిస్థాన్‌లో జరిగిన ఓ సదస్సుకు హాజరైన పుతిన్ మీడియాతో మాట్లాడుతూ, అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం జరిగిన తీరు తనను షాక్‌కు గురి చేసిందని అన్నారు. 'అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌నకు వ్యతిరేకంగా..పూర్తిగా అనాగరిక చర్యలకు పాల్పడ్డారు. ఒకటికి మించి హత్యాయత్నాలు జరిగాయి. వాటి నుంచి బయట పడ్డా..ఇప్పటికీ ఆయన సురక్షితంగా లేరన్నది నా అభిప్రాయం. దీనిపై ట్రంప్ జాగ్రత్తగా ఉంటారనే భావిస్తున్నా' అని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికాతో చర్చించేందుకు సిద్ధమన్నారు.

డాక్టర్-జనాభా నిష్పత్తి భారత్‌లో మెరుగు

1.18 లక్షలకు పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

న్యూఢిల్లీ: డాక్టర్-జనాభా నిష్పత్తి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రమాణాల కన్నా మన దేశంలో మెరుగ్గా ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం లోక్‌సభకు తెలిపారు. ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు ఉండాలని డబ్ల్యూహెచ్‌ఓ చెప్పిందని, మన దేశంలో ప్రతి 811 మందికి ఒక వైద్యుడు ఉన్నారని ఆయన చెప్పారు. రాష్ట్ర వైద్య మండళ్లు, జాతీయ వైద్య కమిషన్ వద్ద ఈ ఏడాది నవంబర్ నాటికి 13,86,145 మంది అల్లోపతిక్ వైద్యులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వైద్య కళాశాలల సంఖ్యను పెంచామని, 2014కు ముందు 51,348 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవని, ఇప్పుడు 1,18,137కు పెరిగాయన్నారు.

గుర్తించదగ్గ వ్యాధుల జాబితాలో పాము కాటు

న్యూఢిల్లీ: పాము కాటు సంఘటనలు, వాటి వల్ల సంభవించే మరణాల గురించి ప్రభుత్వానికి తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పాము కాటును గుర్తించదగిన(నోటిఫయబుల్) వ్యాధుల జాబితాలో చేర్చాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. రాష్ట్రాల ప్రజారోగ్య చట్టాలు లేదా ఇతర వర్తించే చట్టాల్లో దీనిని చేర్చాలని చెప్పింది. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కేంద్రాలు ఈ కేసుల గురించి అధికారులకు తెలియజేయడం తప్పనిసరి చేయాలని తెలిపింది. పాము కాటు వల్ల మరణాలు, అంగవైకల్యం వంటివి సంభవించే అవకాశం ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో ఆయుష్ ప్యాకేజీలు లేవు

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకం లబ్ధిదారులకు ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, నేచురోపతి, యునానీ, సిద్ధ, సోవా రిగ్ప, హోమియోపతి) ప్యాకేజీలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు చెప్పింది. సెకండరీ, ప్రాంతీయ దవాఖానల్లో చికిత్సకు సంవత్సరానికి ఒక కుటుంబానికి రూ.5 లక్షల వరకు సాయం చేయాలని కేంద్రం నిర్ణయించింది.

మళ్లీ అదే రభస

డిసెంబర్ 2కు పార్లమెంట్ వాయిదా

లోక్‌సభలో స్పీకర్ పోడియం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ, నవంబర్ 29: పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. యూపీలోని సంభల్‌లో చెలరేగిన హింస, అదానీ అవినీతి తదితర అంశాలపై చర్చ జరగాలంటూ విపక్షాలు పట్టుబట్టడంతో ఉభయ సభల కార్యక్రమాలకు శుక్రవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఉభయ సభలను డిసెంబర్ 2వ తేదీకి వాయిదా వేశారు. తొలుత 11 గంటలకు లోక్‌సభ సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ ఎంపీలు స్పీకర్ స్థానం దగ్గరకు వచ్చి నినాదాలు చేయడం ప్రారంభించారు. ప్రశ్నోత్తరాల సమయంలో రెండు ప్రశ్నలు పూర్తయ్యాయో లేదో తిరిగి సభకు ఆటంకం ఏర్పడటంతో స్పీకర్ ఓం బిర్లా సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా సభలో నిరసనలు కొనసాగాయి. దీంతో సభను డిసెంబర్ 2వ తేదీకి వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. తామిచ్చిన వాయిదా నోటీసులను చైర్మన్ ధన్‌కర్ తిరస్కరించడంతో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. దీంతో చైర్మన్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

వాయిదా నోటీసులను ఆయుధాలుగా వాడుతున్నారు

సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించేందుకు వాయిదా నోటీసులను విపక్షాలు ఆయుధాలుగా వినియోగిస్తున్నాయని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆరోపించారు. నిబంధన 267 ప్రకారం విపక్షాలు నోటీసులు ఇస్తూ దానిని ఒక ఆయుధంగా వాడుకుంటున్నాయని అన్నారు. 'విపక్షాలకు నిబంధన 267 సభను అంతరాయం కలిగించే ఆయుధంగా మారింది' అని ఆయన వ్యాఖ్యానించారు. తనకు విపక్షాల నుంచి 17 నోటీసులు అందాయని తెలిపారు. ఆయన వ్యాఖ్యల అనంతరం ఎంపీలు ప్రధాని మోదీ, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధన్‌కర్ 'మన చర్యలు ప్రజా కేంద్రీకృతంగా లేవు. అవి పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా, వారికి సంబంధం లేకుండా ఉన్నాయి. వారు మనల్ని ఎగతాళి చేస్తున్నారు. వాస్తవంగా మనం నవ్వుల పాలయ్యాం' అని వ్యాఖ్యానిస్తూ సభను సోమవారానికి వాయిదా వేశారు.

అదానీ అంశంపై యూఎస్ నుంచి ఎలాంటి విజ్ఞప్తి అందలేదు

అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు, అమెరికా న్యాయ శాఖకు సంబంధించిన చట్టపరమైన అంశంపై తమకు ఆ దేశం నుంచి ఎలాంటి సమాచారం కానీ, విజ్ఞప్తి కానీ అందలేదని కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. వారాంతపు సమాచార వివరణలో భాగంగా శుక్రవారం ఆ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ 'ఇది కొన్ని ప్రైవేట్ సంస్థలు, కొందరు వ్యక్తులు, అమెరికా న్యాయ శాఖలకు సంబంధించిన న్యాయపరమైన అంశంగా మేము చూస్తున్నాం. దీనికి కచ్చితంగా ప్రస్తుతం అమలులో ఉన్న పద్ధతులు, న్యాయపరమైన విధానాలను పాటించాలి. దానిని మేము అనుసరిస్తాం. ఈ విషయంలో భారత ప్రభుత్వానికి యూఎస్ మందస్తు సమాచారం ఇవ్వలేదు' అని తెలిపారు. సమన్లు, అరెస్ట్ వారెంట్లకు సంబంధించి యూఎస్ నుంచి ఏదైనా విజ్ఞప్తి వస్తే అందులోని యోగ్యతాయోగ్యతలను తమ ప్రభుత్వం పరిశీలిస్తుందని స్పష్టం చేశారు.

మహా సీఎం.. ఇంకా సస్పెన్సే

- డిప్యూటీపై షిండే విముఖత?
- హఠాత్తుగా సొంతూరికి
- కూటమి కీలక సమావేశం రద్దు

అమిత్‌షాతో సమావేశమైన ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే

ముంబై, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ), న్యూఢిల్లీ: మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై సస్పెన్స్ ఇంకా వీడలేదు. ఒక పక్క బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్ కాబోయే సీఎం అని అనధికార ప్రచారం జరిగినా దానిని అధికారికంగా ఎవరూ ధ్రువీకరించ లేదు. ఈ పదవికి ప్రధాన పోటీదారుగా ఉన్న శివసేనకు చెందిన ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అసంతృప్తిగా ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. అధిష్ఠానం నిర్ణయానికి ఆయన ఎంతమాత్రం సంతోషంగా లేరని, దానికి నిరసనగానే హఠాత్తుగా ఆయన తన సొంత గ్రామం సతారకు వెళ్లిపోయారని, ఆయన గైర్హాజరీతో శుక్రవారం జరగాల్సిన రెండు కూటమి సమావేశాలు రద్దయ్యాయని కొందరు శివసేన నేతలు తెలిపారు.

బీజేపీ ఫార్ములా నచ్చకే...

గురువారం అమిత్ షా నివాసం (ఢిల్లీ)లో జరిగిన కీలక సమావేశానికి ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో కేబినెట్‌లో పదవుల పంపకానికి సంబంధించిన బ్లూప్రింట్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ సమావేశం తర్వాత ఏక్‌నాథ్ షిండే.. షాతో అంతర్గత చర్చలు జరిపారు. షిండేకు డిప్యూటీ సీఎం పదవి లేదా కేంద్రంలో మంత్రి పదవిని ఆఫర్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. షిండే కేంద్ర మంత్రి పదవిని అంగీకరిస్తే, మరో శివసేన నేతకు రాష్ట్ర డిప్యూటీ సీఎం పదవిని ఇవ్వాలనుకున్నారు.

నిర్ణయం మార్చుకున్న షిండే...

అమిత్ షాతో సమావేశం నుంచి బయటకు వచ్చిన తర్వాత షిండే తన నిర్ణయాన్ని మార్చుకున్నారని, అధిష్ఠానం ప్రతిపాదించిన కూటమి ఫార్ములా ఆయనకు నచ్చలేదని ప్రచారం జరుగుతున్నది. ముందుగా ఎలాంటి షెడ్యూల్ లేకుండా ఆయన సొంత గ్రామానికి వెళ్లడం పలు అనుమానాలకు దారి తీసింది.

అలాంటిదేం లేదు.. ఫడ్నవీసే సీఎం

షిండే అసంతృప్తిగా ఉన్నారని జరుగుతున్న ప్రచారాన్ని బీజేపీ వర్గాలు కొట్టి పారేస్తున్నాయి. ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రిని చేస్తూ నిర్ణయం జరిగిపోయిందని, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుగా షిండే, అజిత్ ఉంటారని ఆ పార్టీ తెలిపింది. కాగా, బీజేపీ శాసనసభా పక్ష సమావేశం డిసెంబర్ 1న జరగనుంది. దేవేంద్ర ఫడ్నవీస్‌ను కాకుండా, వేరే కొత్త మరాఠా ముఖాన్ని సీఎం పోస్టుకు పరిగణనలోకి తీసుకోవచ్చునని అంటున్నారు.

వజ్రంలో డాటా నిల్వ చేద్దాం!

- క్యూబిక్ సెంటీ మీటర్‌కు 1.85 టీబీ ఉంచొచ్చు
- ఆప్టికల్ డిస్క్‌ను అభివృద్ధి చేసిన పరిశోధకులు



బీజింగ్, నవంబర్ 29: సీడీ, డీవీడీ, బ్లూ-రే డిస్క్, హార్డ్ డిస్క్ వంటి ఎన్నో పరికరాల్లో డాటాను నిక్షిప్తం చేస్తే అది ఎన్నేండ్లు ఉంటుందో చెప్పలేం. ఈ సమస్యకు చైనా పరిశోధకులు సరికొత్త పరిష్కారాన్ని కనుగొన్నారు. లక్షల ఏండ్ల పాటు సమాచారాన్ని సురక్షితంగా స్టోర్ చేసేలా.. వజ్రాల ద్వారా డైమండ్ ఆప్టికల్ డిస్క్‌ను అభివృద్ధి చేశారు. చైనాలోని యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు ఈ కొత్త డివైజ్‌ను రూపొందించి, విజయవంతంగా పరీక్షించారు. ఇందుకు సంబంధించిన వివరాలు 'న్యూ సైంటిస్ట్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సాధారణ బ్లూ-రే డిస్క్ సైజులోనే ఉండే ఈ డైమండ్ డిస్క్‌లో వంద టెరాబైట్ల డాటాను నిక్షిప్తం చేయవచ్చని, డిస్క్‌లోని ఒక్క క్యూబిక్ సెంటీమీటర్‌పై 1.85 టీబీ డాటాను స్టోర్ చేయొచ్చని చెప్తున్నారు. బ్లూ-రే డిస్క్ స్టోరేజ్ సామర్థ్యంతో పోలిస్తే ఇది దాదాపు 2 వేల రెట్లు అధికం. బ్లూ-రే డిస్క్‌లలో కొన్ని దశాబ్దాల పాటు డాటాను నిల్వ చేయవచ్చని, డైమండ్ డిస్క్‌లలో మాత్రం ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్ల అవసరం లేకుండా, గది ఉష్ణోగ్రతలో లక్షల ఏండ్ల పాటు డాటాను పదిలంగా ఉంచొచ్చని పరిశోధకుల్లో ఒకరైన యా వాంగ్ తెలిపారు.

వాతావరణం.. సాంకేతికం

భారత్‌లో విమానాల ఆలస్యానికి ప్రధాన కారణాలు

న్యూఢిల్లీ: పొగ మంచు, దారి కనిపించకపోవడం, వర్షాలు, సాంకేతిక కారణాల వల్ల భారత్‌లో ఇటీవల తరచూ విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. వీటికి తోడు బాంబు బెదిరింపులు, ప్రయాణికుల రద్దీ,, రన్ వేపై దిగడంలో సమస్యలు వంటివాటి వల్ల విమానాలు బయల్దేరడంలో ఆలస్యం జరుగుతున్నది. ముఖ్యంగా ఢిల్లీ విమానాశ్రయంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమానం కనీసం రెండు గంటలు ఆలస్యమయ్యే అవకాశం ఉంటే, దానిలోని ప్రయాణికులను దించేయాలని, అది బయల్దేరినపుడు మరోసారి భద్రతాపరమైన తనిఖీలు చేయరాదని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులు నిర్ణయించారు.

ఇంజినీరింగ్ అద్భుతం.. కొత్త పంబన్

ఇది తమిళనాడులోని రామేశ్వరంలో నిర్మించిన కొత్త పంబన్ వంతెన. ఇది భారత్‌లో తొలి వెర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన అని, ఇది ఆధునిక ఇంజినీరింగ్ అద్భుతమని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అభివర్ణించారు. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ 2 కి.మీ. పొడవైన ఈ వంతెన వల్ల పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ వంతెన ఫొటోలను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు.